

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వామపక్ష నాయకులు శుక్రవారం పట్టణంలో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల నివాస స్థలాలకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సి.రవికుమార్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఎస్ రాయుడు పాల్గొన్నారు.



ప్రచార కార్యక్రమంలో వామపక్ష నాయకులు

ఏప్రిల్ నుంచి దశలవారీగా ఉద్యమం

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆస్కార్‌రావు

ప్రజాశక్తి-రాయచోటి

ఉద్యోగ సమస్యలు పరిష్కారం కాకుంటే ఏప్రిల్ నుండి దశలవారీగా ఉద్యమిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉద్యోగుల కార్యాలయంలో జిల్లా స్థాయి ఉద్యోగుల సమావేశం జిల్లా అధ్యక్షుడు వై.శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆస్కార్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు బకాయిపడ్డ ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో చెల్లించకపోవడం, ఉద్యోగుల జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ సేవింగ్స్ ఖాతాల నుండి రుణాలు విడుదల చేయకపోవడం, జీతాలు సకాలంలో పడకపోవడం, పిఆర్‌సి సమస్యలు పరిష్కారం చేయకపోవడం పట్ల ఉద్యోగులలో వ్యతిరేకత తీవ్రంగా ఉన్నదని తక్షణం ప్రభుత్వం స్పందించాలని విన్నపం చేశారు. ప్రభుత్వ ఉద్యోగ, పెన్షనర్లకు 1వ తేదీనే జీతాలు చెల్లింపు చేయాలని, 11వ పిఆర్‌సి ద్వారా రావలసిన ఆర్థిక ప్రయోజనాల బకాయిల చెల్లింపుల షెడ్యూల్ ప్రకటించాలిన్నారు. ఉద్యోగుల జిపిఎఫ్ ఖాతాల నుండి అనుమతి లేకుండా విత్ డ్రా చేసిన రూ.480 కోట్లను తిరిగి చెల్లింపు చేస్తారో చెప్పాలన్నారు. ఉద్యోగులకు రావలసిన సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ విధిగా ప్రతి ఏటా నిర్దిష్ట కాలపరిమితిలోగా చెల్లించాలన్నారు. ఉద్యోగులకు చెందాల్సిన ఎల్‌టిసి హోమ్ టౌన్ సదుపాయాలను నిర్దిష్ట కాలపరిమితి అనుమతించాలి. ఉద్యోగులకు రావలసిన టూరు సమయంలో టిఎ, డిఎ, ఎఫ్‌టిఎలు నిర్ణీత కాలపరిమితి విధించి చెల్లించాలిన్నారు. ఉద్యోగుల కొన్ని శాఖల ఉద్యోగులు అద్దె భవనాలతో స్వంత ఖర్చులతో కార్యాలయాలను నిర్వహిస్తునందున (వైద్య, ఆరోగ్య శాఖలో ఎఎస్‌ఎంలు ఉపకేంద్రాల నిర్వహణ, సెక్టారు కార్యాలయాల నిర్వహణ) వాటిని మంజూరుచేసి నిర్దిష్ట కాలపమితిలోగా చెల్లిస్తారో తెలియచేయాలని పేర్కొన్నారు. నిర్దిష్ట కాలపరిమితిలోగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపు సకాలంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌రాజు, కార్యదర్శి ఎస్.బాబా సాహెబ్, కృష్ణా జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ బాబు, విశాఖ జిల్లా కార్యదర్శి రవి శంకర్, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలాజీ, జిల్లా కోశాధికారి సుధాకర్ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డినాయక్, వివేకానంద, రెవెన్యూ సంఘం అధ్యక్షులు రమేష్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్మెంట్ రమేష్, కృష్ణవేణి, తాలూకా అధ్యక్షులు సాయి కుమార్, కార్యదర్శి సుజిత్, శ్రీనివాసులు నాయక్, సదాశివారెడ్డి, వలి, కవిత, సావిత్రి, హౌస్ బిల్డింగ్ డైరెక్టర్ సిద్దయ్య, రాజా కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ స్టేట్ కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి, జిల్లాలోని తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

'యుద్ధప్రాతిపదికన జగనన్న ఇళ్ల నిర్మాణాలు'

ప్రజాశక్తి-రాయచోటి

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష ఎంపిడిఒలు, గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు, గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్న స్వచ్ఛ సంకల్పం, బిఎంసియులు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ విసి ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు సంబంధిత అధికారులు అందరూ కృషి చేయాలన్నారు. ఇండ్ల నిర్మాణాలలో ప్రతి వారం దశల వారీగా స్టేజ్ కన్వర్షన్ జరగాలని సూచించారు. వారంలో మూడు రోజులు ఎంపిడిఒలు, హౌసింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కేటాయించిన లక్ష్యంలో ప్రగతి సాధించాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. లే అవుట్లలో నీటి సౌకర్యం, విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాన్ని ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకుని లేఅవుట్ వారీగా ఇచ్చిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఇంకా ప్రారంభంకాని ఇళ్లన్నీ సత్వరమే ప్రారంభించి పునాది స్థాయికి తీసుకురావాలన్నారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు ఒక్కో లబ్ధిదారునికి రూ.35 వేలు రుణం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఎ పీడీని కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లు దగ్గర ఇన్ఫ్రాస్ట్రక్చర్‌లో భాగంగా వాటర్, నేమ్ బోర్డు, రోడ్డు ఏర్పాట్లు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులన్నీ గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. చేసిన పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు బిల్స్ ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని ఎంపిడిఒలకు సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలలో వేగం పెంచి గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసేందుకు ఇంజినీర్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణంలో స్పష్టమైన పురోగతి కనిపించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బిఎంసియు, నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిపిఒ ధనలక్ష్మి, హౌసింగ్ పీడీ శివయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ ప్రసన్నకుమార్, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, పిఆర్ ఎస్ఇ సురేష్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహించాలి : గిరీష

రాయచోటి: ప్రభుత్వ సేవలను ప్రజలకు నిర్దేశించిన సమయంలో అందించేలా సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహించాలని కలెక్టర్ గిరీష్ ఆదేశించారు. శుక్రవారం రాయచోటి పురపాలక సంఘం ఎస్ఎన్ కాలనీ 14వ వార్డులోని వార్డు సచివాలయం-9ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల కేలండర్, సచివాలయ సిబ్బంది రిజిస్టర్లు, పలు రికార్డులను తనిఖీ చేశారు. టాక్స్ కలెక్ట్, ఆయుష్మాన్ భారత్, 90 డేస్ పట్టాస్, వాటర్ సప్లై, శానిటేషన్, ఇంటింటికి చెత్త సేకరణ పై వివరాలు అడిగి తెలుసుకుని సచివాలయ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. శానిటేషన్, ఇంటింటికి చెత్త సేకరణ పక్కాగా జరగాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి అందించే విధముగా సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. సచివాలయం వచ్చే ప్రజలతో సిబ్బంది గౌరవంగా వ్యవహరించి తమ పరిధిలో ఉన్న సేవలను అందించాలన్నారు. కలెక్టర్ వెంట కమిషనర్ రాంబాబు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణపై పర్యవేక్షణ ముమ్మరం

పీలేరు: ప్రజారోగ్య విభాగంలో ఆరోగ్య సేవల నమోదు, సరైన సమయంలో అన్ని సేవల నిర్వహణ, ప్రాముఖ్యతలను అధికారులందరూ గుర్తించాలని జిల్లా కుటుంబ సంక్షేమ ప్రధాన గణాంక అధికారి ఓబుల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం గణాంక అధికారి తన బృందంతో పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో డాక్టర్ నాగవేణి ఆధ్వర్యంలో అన్ని ఆరోగ్య సేవల నమోదు రికార్డ్స్, రిపోర్ట్స్ మొదలగు అంశాలు పరిశీలించారు. జనన, మరణాలు, రోజు వారీ వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు, జబ్బుల విశ్లేషణ, అడ్మిషన్ల అవసరాలు, శస్త్రచికిత్స వివరాలు, వ్యాధుల నిర్ధారణ కొరకు నమోదు చేసుకున్న రోగుల వివరాలు, మాట శిశు సేవల్లో గర్భిణుల సేవలు, ప్రసవ సేవలు, రెఫరల్ సేవలు, కుటుంబ నియంత్రణ శాశ్వత, తాత్కాలిక సేవలు, వ్యాధినిరోధక టీకాల నమోదు, హెచ్ఎం, ఐసి సేవలకు మధ్య వ్యత్యాసానికున్న కారణాలు, సరైన పద్దతిలో నమోదువల్ల లాభాలు, నష్టాలు, లోటుపాట్ల సవరణలు మొదలగు అంశాలను రికార్డుల వారిగా నిశితంగా పరిశీలించి, అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డిఎస్ఒ కరీముల్లా, ఎఎస్ఒ రాజేష్, ఎంపిహెచ్ఇఒ శివారెడ్డి, ఎల్డీ కంప్యూటర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.



ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న ఓబుల్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డిని డిస్మిస్ చేయాలి

- మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అధికార పార్టీకి తొత్తుగా వ్యవరిస్తున్న ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డిని డిస్మిస్ చేయాలని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోగస్ ఓట్లను అడ్డుకోవాల్సిన అధికారులు దగ్గర ఉండి మరీ చేర్పించడం బాధాకరమన్నారు. ప్రయివేట్ పాఠశాలల, కళాశాలల ఉపాధ్యాయులకు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించడంతో బోగస్ ఓట్లకు అధికార పార్టీ తెరలైపోయిందని విమర్శించారు. ఆర్‌జెడి విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజల సొమ్మును జీతంగా తీసుకుంటున్న ఆర్‌జెడి అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరించాలంటే సిఎం జగన్ ఇంట్లో కూలివాడిగా చేరితే మంచిదన్నారు. ఆర్‌జెడి స్థాయిలో ఇంత దిగజారడం సిగ్గుచేటన్నారు. అప్పర్ భద్రతతో సిఎం సొంత జిల్లాకు నష్టం జరుగుతున్నా స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఆస్తులను కాపాడుకోవడానికి, వివేక హత్య కేసు కోసం ఢిల్లీ ప్రదక్షిణలు చేయడం జగన్‌కు సరిపోతుందన్నారు. మహారాష్ట్ర బాబ్లీ వద్ద ప్రాజెక్టు ఎత్తు పెంచుతూ ఉంటే చంద్రబాబు నాయుడు అడ్డుకున్నారని అక్కడి పోలీసులు అరెస్టు కూడా చేశారని గుర్తు చేశారు. నిరుద్యోగులను మోసం చేసేందుకే రెండవసారి ఉక్కు పరిశ్రమకు జగన్ శంకుస్థాపన చేశారని విమర్శించారు. టిడిపి పోలిట్ బ్యూరో శ్రీనివాసరెడ్డి, కడప జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి మాట్లాడుతూ సజ్జల రామకృష్ణారెడ్డి దర్గా స్థలాన్ని ఆక్రమించి ప్రహరీని నిర్మించడం దుర్మార్గమన్నారు. అమీర్ బాబుతో పాటు మైనార్టీ నాయకులను అరెస్టు చేయడానికి ఖండిస్తున్నామన్నారు. కోర్టులో స్టేటస్‌కో ఉన్నా నిర్మాణ పనులు చేయడం వైసిపి నాయకులకే చెల్లిందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు బీటెక్ రవి, ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు పూర్వపు విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

మదనపల్లె బిటి కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల 19న నిర్వహిస్తున్నామని అధ్యక్షులు గంగారపు రాందాస్ చౌదరి అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా బిటి కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో బిటి కళాశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి సమావేశంలో చర్చిస్తామని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో బిటి కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం జనరల్ సెక్రెటరీ మధుసూదన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, బోర్‌వెల్ సుధాకర్, రెడ్డి సుబ్రహ్మణ్యం, సుదర్శన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- సమీక్షా సమావేశంలో కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో పట్టబద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయాతో కలిసి కలెక్టర్ గిరీష ఆర్‌డిఒలు, తహశీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయ, ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మార్చి 13వ తేదీన జరిగే ఈ ఎన్నికలలో ఎటువంటి చిన్నపాటి సమస్యకు తావు లేకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎన్నికలు జరిగే మండలాలకు సెన్సిటీవ్, హైపర్ సెన్సిటీవ్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి తగు చర్యలు చేపట్టాలని ఆర్‌డిఒలకు సూచించారు. పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని వసతులు ఉండేటట్లు చూడాలన్నారు. ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి పోలింగ్ సామగ్రి, స్ట్రాంగ్ రూము, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కౌంటర్లు, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్ల విషయంలో పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల మోడల్ కోడ్ ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. సెన్సిటీవ్, హైసెన్సిటీవ్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా కేంద్రాలకు తగు భద్రతా సిబ్బందిని నియమించడం జరుగుతుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి వీడియో గ్రాఫర్, మైక్రో అబ్జర్వర్‌లను, రూట్ ఆఫీసర్లు, సెక్టోరల్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లను నియమించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించేవారు గతంలో నిర్వహించిన ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లె ఆర్‌డిఒలు రంగస్వామి, మురళి, కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, తహశీల్దార్లు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

మైనార్టీల అభివృద్ధే లక్ష్యం : 'చింతల'

వాల్మీకిపురం: రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ సెక్రటరీ అయూబ్ హుసేన్ అన్నమయ్య జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం వాల్మీకిపురంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం సహా ముస్లిం మైనార్టీలు, ఉర్దూ విద్యార్థులు, ఉపాధ్యాయులు అత్యధికంగా ఉన్న అన్నమయ్య జిల్లాలో ఉర్దూ అకాడమీ సేవలను విస్తృతం చేయాలన్నారు. సమాజంలో ముస్లిం మైనార్టీలు ఇప్పటికీ సామాజికంగా వెనుకబడి ఉన్నారని, పేదరికంతో అలమటిస్తున్నారని, మైనారిటీల అభ్యున్నతికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తున్నప్పటికీ దారిద్ర్యరేఖ దిగువనే ఉండడం విచారకరమన్నారు. మైనార్టీలు విద్యాపరంగా అభివృద్ధిని సాధించినప్పుడే సామాజిక ప్రగతి సాధ్యమవుతుందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన పీలేరులో ఉర్దూ అకాడమీ గ్రంథాలయాన్ని, కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన భవన వసతిని కల్పిస్తామన్నారు. పీలేరు నియోజకవర్గంలో 35వేల మంది ముస్లిం మైనార్టీలు ఉన్నారని, వీరందరూ ఉర్దూను చదివే వారేనని తెలిపారు. కలికిరి, గుర్రంకొండ మండలాల్లో హిందువులు కూడా ఉర్దూ చదవడం రాయడం గమనార్హమన్నారు. అనంతరం ఉర్దూ అకాడమీ డైరెక్టర్ సెక్రటరీ అయ్యూబ్ హుసేన్ మాట్లాడుతూ పీలేరులో ఉర్దూ అకాడమీ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామని, ఇందుకు రాష్ట్ర చైర్మన్ నదీమ్ అహ్మద్ కూడా సుముఖంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం అయ్యూబ్ హుసేన్‌ను ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి మైనార్టీ నాయకుడు అబ్దుల్ కలీమ్, కలికిరి మండల కోఆప్షన్ సభ్యులు రిజ్వానుల్లా, వైసిపి నాయకులు చికెన్ మస్తాన్, సైఫుల్లా, గంగయ్య, సద్దాం, ఉర్దూ అకాడమీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అయూబ్ హుసేన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చింతల

అత్తిరాల బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

దక్షిణ కాశీగా పేరొందిన అత్తిరాల కామాక్షి సమేత త్రేతేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను డిఎస్‌పి జి.శివ భాస్కర్‌రెడ్డి శుక్రవారం సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ సిఐ పుల్లయ్య, ఎస్ఐ భక్తవత్సలం పాల్గొన్నారు.






వైద్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు

రోగులకు అందుబాటులో ఆధునిక వైద్యం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని వైసిపి కార్యాలయం సమీపంలో రోగులకు ఆధునిక వసతులతో వైద్యం అందించేందుకు ఆరోగ్య ఆస్పత్రిని జయరాజ్ ఆధ్వర్యంలో డాక్టర్ తిప్పన మణిదీప్, డాక్టర్ మృణాళినిలు ఆర్థో, ఇఎన్‌టి, సమస్యలకు ప్రత్యేకత చికిత్సలతో పాటు ఆపరేషన్లు కూడా నిర్వహించేందుకు తగిన వసతులు కల్పించామని జయరాజ్ తెలిపారు. ఆరోగ్య హాస్పిటల్‌ను మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు ప్రారంభించి ఆస్పత్రిలోని వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సలహామండలి జిల్లా చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ తిప్పన కృష్ణయ్య, మాజీ ఉప సర్పంచ్ నార్జాల హేమరాజ్, నవీన్, తిప్పన రాజశేఖర్ జయచంద్ర, ప్రహ్లాద పాల్గొన్నారు.

వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ సమీపంలోని కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం రాత్రి పార్వతీ పరమేశ్వరులు బలిజ కులస్తులకు సంబంధించిన మయూర వాహనంపై విహరించారు. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎస్ఐ తిప్పేస్వామి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

టిడిపి అభిమాని సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-నందలూరు

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బత్యాల చెంగల్‌రాయుడు ఎమ్మెల్యే కావాలని మండలంలోని పాచికాలువకు చెందిన టిడిపి అభిమాని నాగరాజు బ్రహ్మంగారిమఠానికి సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చి బత్యాల చెంగల్ రాయుడు ఎమ్మెల్యేగా గెలుపొందాలని సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు.

వేమన పద్య పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి-కలికిరి

రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేమన కంఠస్థ పద్య పోటీలకు విద్యార్థుల నుండి విశేష స్పందన లభించింది. యోగి వేమన జయంతిని పురస్కరించుకొని శుక్రవారం పులి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు కలికిరి, వాయల్పాడు, సదుం, కలకడ మండలాల నుండి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జడ్జిలుగా ఎస్వియు పాలక మండలి మాజీ సభ్యులు వేంపల్లి అబ్దుల్ ఖాదర్, బ్రహ్మారెడ్డి, కవి మురళీధర్‌రాజులు వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం మొదటి, రెండవ, మూడవ బహుమతులను ప్రదానం చేయనున్నట్లు సభ్యులు పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య విలువలకు సిఎం తిలోదకాలు

రాజంపేట అర్బన్ : వైసిపి పాలనలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిచ్చారని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో టిడిపి నేతలు ప్రచారానికి వెళ్ళనీయకుండా ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డిని పోలీసులను అడ్డుపెట్టుకొని ఉద్దేశపూర్వకంగా అరెస్టు చేశారని అన్నారు.

వెండి రుద్రాక్ష మాల బహూకరణ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల పరిధిలోని ప్రసిద్ధ శైవ ఆలయం లోని యోగ నేలమల్లేశ్వర స్వామికి మండల జడ్‌పిటిసి కె.ప్రమీలమ్మ, ఆమె భర్త మండల వైసిపి ఇన్‌ఛార్జ్ ఆర్ఐ.రమణారెడ్డితో కలిసి వెండి రుద్రాక్ష మాలను బహుకరించారు. నేల మల్లేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.22వేలు విలువగల, 250 గ్రాముల వెండితో తయారు చేసిన మాలతో పాటు, 108 వెండి తొడుగుల రుద్రాక్షలను, 250 గ్రాముల వెండిమాలలో పొందుపరిచారు. ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, రవి, ఆలయ అర్చకులు శంకరశర్మలకు రుద్రాక్ష మాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శివరాత్రికి సిద్ధమైన ఆలయాలు

ప్రజాశక్తి-ములకలచెరువు

మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. స్థానిక రామాపురంలోని శివాలయం, కనుగొండలో వెలసిన కనుగొండరాయస్వామి ఆలయం, వేపూరికోట శివాలయం, గూడుపల్లె శివాలయం తదితర గ్రామాల్లోని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. తంబళ్లపల్లె మండలం, మల్లయ్య కొండపై వెలసిన మల్లికార్జునస్వామి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. మల్లయ్యకొండకు వచ్చే భక్తులకు భోజన సౌకర్యంతో పాటు దారి పొడవున తాగునీరు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకోనున్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు

పెద్దమండ్యం-ప్రజాశక్తి

మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కాగృహాలు మంజూరు చేస్తామని హౌసింగ్ డిఇ శ్రీహరి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక హౌసింగ్ కార్యలయంలో ఆయన మాట్లాడుతూ అర్హులైవుండి సొంత ఇంటి స్థలం కలిగి వారికి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలో ప్రస్తుతం 1543 పక్కా భవనాలు మంజూరు అయ్యాయని, ఇందులో 255 పక్కా గృహాలు పూర్తి స్థాయిలోను, మిగిలినవి త్వరలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ సందీప్, వర్క్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.

సముద్ర శాస్త్రవేత్తలకు పునాది : వైవీయూ విసి

కడప అర్బన్ : సముద్ర తీరప్రాంతాలను గూర్చిన పాఠ్యంశాలను సంకలనపర్చి, ఒక పుస్తకం రూపంలో భూ విజ్ఞాన శాఖ ఆధ్వర్యంలో తీసుకు రావడం దక్షిణ భారత దేశంలోనే తొలి ప్రయత్నమని, ఈ పుస్తకం సముద్ర శాస్త్రవేత్తలకు ఒక పునాది లాంటిందని వైవీయూ విసి రంగ జనార్ధన్ పేర్కొన్నారు. 'సముద్ర తీర ప్రాంతాలు, నదీవాలు, సరస్సులు , సుస్థిరఅభివృద్ధి' అనే అంశంపై ఆచార్యులు జయరాజు, పరిశోధనా బృందం జి.శ్రీనివాసులు(కొరియా) ఎం.మాధక్క, మంజులత (కొరియా) సహ సంపాదకులుగా రూపొం దించిన పుస్తకాన్ని విసి ఆచార్య రంగ జనార్ధన్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్యతో కలిసి ఆవిష్కరించారు. విసి మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని ప్రపంచ ప్రఖ్యాత ప్రచురణ సంస్థ ప్రచురించడం పరిశోధన ప్రమాణాలకు కొలబద్ద అన్నారు. సంపాదకులు ఆచార్య జయ రాజు బృందాన్ని అభినందించారు.

మహారాజశ్రీ రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 156/2021

SBI Akepadu Rep.by
బ్రాంచి మేనేజర్.
...వాది

Vs

1. కీర్తిపాటి విష్ణుప్రియ, D/o Late చెంగల్‌రాజు,
2. కీర్తిపాటి గోపీక్రిష్ణ వర్మ, S/o Late చెంగల్‌రాజు

Both are R/o H.చెర్లోపల్లి గ్రామం, రాజంపేట మండలం, ప్రస్తుతం నూనేవారిపల్లె రోడ్డు, రాజంపేట టౌను, పోస్టు, మండలం, కడప జిల్లా.
...2,3 ప్రతివాదులు

వాది బ్యాంకు వారు మీ పైన బ్యాంకు బాకీ వసూలు నిమిత్తం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, రాజంపేటలో దావా దాఖలు చేసినారు. మీకు ఎలాంటి అభ్యంతరాలు వున్న 20.02.2023 తేదీ 10.30 గంటలకు కోర్టులో హాజరై మనవి చేసికొనవలయును. లేనంతట శ్రీ కోర్టు వారు మీ పరోక్షంగా తీర్మానం చేయబడునని ఇందుమూలంగా తెలుపడమైనది.

//By Order Of The Court//

జి.రామచంద్ర, B.Com., B.L.,
అడ్వకేట్, రాజంపేట

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి : 'గడికోట'

ప్రజాశక్తి-గాలివీడు


సమావేశానికి హజరైన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

వైసిపి ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గాలివీడు లోని ఎస్ కె ఫంక్షన్ హాల్లో గాలివీడు మండల గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ దేశం గర్వపడేవిధంగా ప్రజా సంక్షేమ పాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్ ఆశయాలను ప్రజల చెంతకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులుపై ఉందన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదంతో ముందుకు సాగుతూ అభివృద్ధి ఫలాలు అందుకుంటున్న లబ్ధిదారులకు జగనన్న ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను వివరించాలన్నారు. 2024లో వైసిపి గెలుపే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా పనిచేయాలని సూచించారు. చంద్రబాబు పదిహేనేళ్ల పాలనలో చెప్పుకునేందుకు శాశ్విత అభివృద్ధి పథకం ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. ఎంతో వెనుకబడిన రాయచోటిని జిల్లా కేంద్రం చేసిన సిఎం జగన్ చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. ముఖ్యమంత్రిని విమర్శించే అర్హత నారా లోకేష్‌కు లేదన్నారు. కార్యక్రమంలో ఎంపిపి జల్లా సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపిపి మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి, నాయకులు ఎస్‌కె.ఖాదర్ మోహిద్దీన్, సింగిల్ విండో అధ్యక్షుడు వేదమూర్తిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆవుల నాగభూషణ్‌రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు , వాలంటీర్లు పాల్గొన్నారు.

ముస్తాబైన పొలతల క్షేత్రం

వివిధ ప్రాంతాల నుంచి చేరుకున్న యాత్రికులు
జనంతో కిటకిటలాడుతున్న ఆలయ పరిసరాలు

ప్రజాశక్తి-పెండ్లిమర్రి


మూలవిరాట్


దర్శనం కోసం క్యూలైన్లో వేచివున్న భక్తులు

మహా శివరాత్రి ఉత్సవాలకు పొలతల క్షేత్రం ముస్తాబైంది. శుక్రవారం నుంచి వివిధ జిల్లాల నుండి పెద్ద ఎత్తున యాత్రికులు ట్రాక్టర్లు, బస్సులు, లారీలు, జీపులు, ద్విచక్ర వాహనాల ద్వారా భక్తజనం పొలతలకు చేరుకున్నారు. యాత్రికులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడు తున్నాయి. శివపార్వతులను దర్శించుకునేందుకు కొలనులో స్నానం ఆచరించి భక్తి శ్రద్ధలతో క్యూలైన్‌లో వెళ్లి స్వామివారి దర్శనం పొందుతున్నారు. అక్క దేవతలు ఆలయం వద్ద మహిళలు సంతానం కొరకు కొలనులో స్నానమాచరించి ఆలయం వద్ద వర పడ్డారు. బండెన్న స్వామి ఆలయం వద్ద మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కార్యనిర్వాహణాధికారి మహేశ్వర్ రెడ్డి, ఆలయ చైర్మన్ అంబటి రాజగోపాల్‌రెడ్డి అన్ని చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. డిఎస్‌పి వెంకటశివారెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ లో ఎలాంటి సమస్య తలెత్తకుండా వాహనాలను నిర్ణయించిన ప్రదేశాల్లోని కి పంపించారు. ఆర్‌టిసి బస్సులను గుడి వరకు వచ్చే విధంగా పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు. పొలతల క్షేత్రంలో కాశీనాయన ఆశ్రమంలో భారీగా భక్తజనం అన్నదాన అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పొలతలను సందర్శించిన ఎస్‌పి

ఎస్‌పి అన్బురాజన్, గండి దేవస్థానం అడిషనల్ కమీషనర్ ముకుందరెడ్డిలు పొలతల క్షేత్రాన్ని సందర్శించారు. అర్చకుల నుంచి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎస్‌పి సూచించారు. శనివారం ఉదయం 10 గంటలకు శ్రీ మల్లేశ్వరుని స్వామివారి కల్యాణం జరుగుతుందని, స్వామివారి కి ఎమ్మెల్యే రవింద్రనాథ్ రెడ్డి దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రాత్రి10 గంటలకు స్వామి వారి ఊరేగింపు జరుగుతుందని ఇఒ మహేశ్వర రెడ్డి తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి

సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలి

ప్రజాశక్తి-గాలివీడు

సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ప్రతి ఒక్కరు ఎదగాలని గాలివీడు సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మల ఆధ్వర్యంలో స్కూల్ కమిటీ చైర్మన్ కుందా లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవం, అపోటెక్స్ మనం సంస్థల ప్రతినిధులు బాలికల ఉన్నత పాఠశాలకు రూ.10 లక్షలు విలువచేసే వస్తు సామాగ్రిని పాఠశాలకు అందించి నందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అపోటెక్స్ డైరెక్ట్ యోగాంజనేయరెడ్డి మాట్లాడుతూ విద్యకు పేద, ధనిక అనే సంబంధం ఉండదని అన్నారు. మనం ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ప్రకాష్ మాట్లాడుతూ మాట్లాడే తత్వాన్ని పెంచుకోవాలని, మౌలిక సదుపాయాలు ఉన్నత స్థానాన్ని కోరుకోవాలని తెలిపారు. ఎంఇఒ చక్రెనాయక్ పాఠశాల లోని 750 మందికి హై జీన్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మనం సభ్యులు వాణి, పద్మావతి, సంధ్య, శ్రీనివాసులు, భూషణ్ రెడ్డి, కాశీ విశ్వనాధ రెడ్డి, శ్రీనివాసులు, హర్షద్, షేక్షావలి, పిటి మాస్టర్ కరుణాకర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పసుపు పంట నూర్పిడికి సన్నద్ధం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో పసుపు సాగు చేసిన రైతులు నూర్పిడికి సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం పసుపు ఆకులను తొలగించే పనులు చేస్తున్నారు. తర్వాత దుక్కిళ్ల చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ఫిబ్రవరి చివరి వారంలో నూర్పిడి చేపట్టాలని భావిస్తున్నారు. మండల వ్యాప్తంగా 400 ఎకరాలలో రైతులు పసుపు పంటను సాగు చేశారు. పంట నూర్పిడి చేసి వట్టి పసుపుగా మార్చి అమ్మకాలు చేపడతారు. మైదుకూరు, దువ్వూరు ప్రాంతాల్లో మాత్రం ఆలస్యంగా నూర్పిడి చేసి విత్తనపు పసుపుగా అమ్మకాలు చేపడతారు. పంట దిగుబడి ఆశాజనకంగా ఉండవచ్చని రైతులు భావిస్తున్నారు .తెగుళ్ళు చాలా వరకు తగ్గాయని, అధిక వర్షాలకు పసుపుకొమ్ములు దెబ్బతిని ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పసుపు పంట ధరలు మాత్రం చాలా అధ్వానంగా ఉన్నాయని సరైన గిట్టుబాటు ధర కల్పిస్తే ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం సీతారామపురం, చాపాడు గ్రామాల వద్ద పసుపు ఆకు తొలగిస్తూ రైతులు నూర్పిడి పనులకు సిద్ధమవుతున్నారు.

రేపు అల్లాడుపల్లెలో బండలాగుడు పోటీలు

చాపాడు : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 19న వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తలి మండలి చైర్మన్ జిటి వెంకటసుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు, సర్పంచ్ కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. బండలాగుడు పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎద్దులకు అల్లాడుపల్లె గ్రామానికి చెందిన వీర నారాయణయాదవ్ రూ.100116లు బహుమతిగా అందజేయనున్నారు. ద్వితీయ బహుమతిని లక్ష్మీ పేట కర్నాటి నారాయణరెడ్డి రూ. 70 116 లు, అల్లాడుపల్లె రజకుల సంఘం వారు రూ. 60116, నాలుగో బహుమతిని ,చెన్నూరు జువెలర్స్ వారు రూ. 40116, 5వ బహుమతి ఎంపీపీ టి లక్షుమయ్య రూ. 20116, 6వ బహుమతిని నరహరిపురం గ్రామానికి చెందిన పి.చిన్న వీరారెడ్డి కుటుంబ సభ్యులు రూ.12116 ,7వ బహుమతిని కోడూరు వెంకట శివ కుటుంబ సభ్యులు రూ. 5116 అందజేయనున్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎస్ రఘురామి రెడ్డి హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాల్గొను వృషభరాజముల యజమానులు 19న ఉదయం 11 గంటలలోపు కమిటీ సభ్యులకు తమ పేర్లు తెలియజేయాలని వారు కోరారు.

పవన్‌కుమార్ నామినేషన్

కడప అర్బన్ :అనంతపురంలోపశ్చిమరాయలసీమ (కడప, అనంతపురం, కర్నూల్ జిల్లాలు) పట్టభద్రుల శాసనమండలి ఎంఎల్‌సి ఎన్నికలకు మొదటి సెట్టు నామినేషన్‌ను స్వతంత్ర్య అభ్యర్థి పట్టుపోగుల పవన్‌కుమార్ శుక్రవారం వేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్ గార్గ్‌కు తన ఛాంబర్లో సమర్పించారు. కార్యక్రమంలో సిఆర్ఐ సునీల్, జయంత్, సురేష్, కార్తిక్, రవి తేజ యాదవ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

ప్రజా సమస్యలను పరిష్కరించడమే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కడప పార్లమెంటు సభ్యుడు వై.ఎస్. అవినాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ముఖ్యమంత్రి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజా ప్రతినిధులను ప్రజల ఇంటి వద్దకే పంపి వారి సమస్యలను ఎప్పటికీ ఎప్పుడూ పరిష్కరించేందుకు గడప గడప కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని జగనన్న ఆకాంక్ష అన్నారు. ప్రజల సమస్యలు సంబంధిత అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించారు.

లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని జమ్మలమడుగు ఎస్ఐ సుబ్బారావు అన్నారు. శుక్రవారం సాయంత్రం పెన్నా నది బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా ఎలాంటి వాహనమూ నడప రాదన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు ద్విచక్ర వాహనాలు కానీ, ట్రాక్ట ర్లు, కార్లు వంటివి తల్లిదండ్రులు ఇవ్వరాదన్నారు. ప్రమాదం జరిగి ఏమైనా అయితే జవాబుదారీ ఎవరని ప్రశ్నించారు. సరైన పత్రాలు లేని వారికి జరిమా నా విధించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు బాదుల్లా, సురేష్ పాల్గొన్నారు.

నేడు, రేపు సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని శని, ఆదివారాలలో పులివెందులలోని శిల్పారామంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శిల్పారామం ప్రత్యేక అధికారి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఫాతిమా మెడికల్ స్టోర్, పులివెందుల, పాలగిరి ప్రదీప్ సియోన్ పురం వారి సౌజన్యంతో మాస్టర్ ట్టి అధ్వర్యంలో అంకాలమ్మ మెమోరియల్ పాఠశాల , వేల్పుల చిన్నారులచే సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు అద్భుతమైన నృత్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు. పులివెందుల పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

మండల పరిధిలోని మార్కెట్ యార్డ్‌లో శనగల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం వ్యవసాయ సహాయ సంచాలకులు అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగల కొనుగోలుకు మార్క్‌ఫెడ్ సంస్థకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని చెప్పారు. క్వింటాకు రూ. 5335 కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సర్వతంరెడ్డి, పులివెందుల, లింగాల, వేముల మండలాల వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాం

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దామని పురపాలక చైర్మన్ డాక్టర్ వల్లపు వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సి.ఎం. వైస్ జగన్మోహన్ రెడ్డి పులివెందుల పురపాలకను మోడల్ టౌన్ తీర్చిదిద్దుతున్నారు. ఆయన ఆదర్శాలకు అనుగుణంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సహకారంతో వైసిపి పులివెందుల మున్సిపల్ ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల మూడు రోజులు కౌన్సిలర్‌తో కలిసి ఇండోర్ పర్యటనకు వెళ్లామన్నారు. నేరుకు అక్కడి ప్రజలు తడి పొడి చెత్త వేరు చేయు విధానంలో ఎన్నో కొత్త విధానంతో తయారు చేస్తారని తెలిపారు. అనేక ఉపకరణాలను తయారు చేయడంలో ఎంతో బాగుందని తెలిపారు. పుర ప్రజలు కూడా ఎక్కడ పడితే అక్కడ చెత్త వెయ్యకుండా బుట్టలనే వేసి మీ ఇంటి ముందుకు వచ్చే మునిసిపాలిటీ వానల్లో అందించాలని కోరారు. పులివెందుల పట్టణ అభివృద్ధిలో ప్రజల సహకారం ఎంతో ఉందని చెప్పారు. అందులో భాగంగానే మనకు స్వచ్ఛ సర్వేక్షన్ 2022 అవార్డు వచ్చిందని తెలిపారు. మరిన్ని అవార్డులు మనం తీసుకొచ్చే విధంగా ఒక ప్రణాళిక బద్ధంగా మనం ముందుకు వెళ్లాలని ఆయన కౌన్సిలర్‌కు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పురపాలక వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు, పార్నపల్లి కిషోర్, విజయ్ కుమార్ నాయుడు, ఖాదర్, అరగంట వేముల సుజాత, ఉన్నారు.


కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గంగమ్మ జాతరకు కలెక్టర్, ఎస్‌పిలకు ఆహ్వానం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఈనెల 21, 22వ తేదీలలో జరగనున్న గంగమ్మ జాతరకు జిల్లా కలెక్టర్ గిరీష, ఎస్‌పి హర్షవర్ధన్ రాజు లను కలిసి గంగమ్మ జాతర ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ సామల నరసింహారెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి రవీంద్ర రాజులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా రెండు లక్షల మంది భక్తులు గంగమ్మ జాతరకు తరలివస్తారని రెండు రోజులపాటు జాతర అత్యంత వైభవంగా జరుగుతుందని తెలిపారు. ఈ జాతరకు కుటుంబ సభ్యులతో రావాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు నలంద విద్యాసంస్థ కరస్పాండెంట్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట


రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న రోడ్డురోలర్

మండల కేంద్రమైన బి.కొత్తకోట నుంచి బడికాయలపల్లి వెళ్లే రహదారి ఇటీవల వర్షాలకు, జగనన్న కాలనీల అవసరాల కోసం ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇటుక లోడ్లు రావడంతో పూర్తిగా రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డు దుస్థితి గమనించిన అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం అధికారులు యంత్రాల సహాయంతో మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయడంతో పట్టణ ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

భార్యపై భర్త హత్యాయత్నం..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


భర్త దాడిలో గాయపడిన సుజాత

భార్యపై భర్త హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు, బాధితురాలు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని, వేంపల్లె పంచాయతీ, బండకిందపల్లెకు చెందిన భాస్కర్ భార్య సుజాత(40) కూలీపనులు చేసుకుని జీవనం సాగిస్తోందని, ఆమె భర్త భాస్కర్ కూలీపనులు చేస్తాడని తెలిపారు. వీరికి ఇంజనీరింగ్ చదువుతున్న కుమారుడు ఉన్నాడని, గత కొంత కాలంగా భాస్కర్ అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని భార్యను తరచూ హింసించడం, ఇల్లు వదిలి వెళ్ళిపొమ్మని చెప్పేవాడని అన్నారు. ఈ విషయమై గురువారం రాత్రి గొడవ పెట్టుకుని అందరూ నిద్రపోయాక గొంతు నిలిమి కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి చంపేందుకు ప్రయత్నం చేశాడని బాధితురాలు ఆరోపించింది. గతంలోనూ పలుమార్లు గొడవలు జరిగినా పెద్దమనుషులు సర్ది చెప్పారని పేర్కొంది. భర్త దాడిలో తీవ్రంగా గాయపడిన సుజాతను గ్రామస్తులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మనస్థాపంతో వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-కలికిరి

తప్పిపోయిన తన కొడుకు కనిపించక పోవడంతో మనస్థాపంతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని కె.రెడ్డివారిపల్లి పంచాయతీ, తుమ్మలపేట వడ్డిపల్లిలో నివాసమున్న వి.కృష్ణయ్య(62) తన కుమారుడు నాగమల్లయ్య ఈ నెల 9న ఇంటి నుండి వెళ్ళిపోయాడని తెలిపారు. కోడలు ఫిర్యాదుపై కలికిరి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ లోకేశ్‌రెడ్డి మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అదృశ్యమైన తన కుమారుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన కృష్ణయ్య ఊరికి సమీపములోని జడావాండ్లపల్లి గుట్ట శివారులో గురువారము ఉదయం టమోటా చెట్లకు కొట్టే రోగోర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న బంధువులు కలికిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స నిమిత్తము తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య రమాదేవి ఫిర్యాదు పై కలికిరి ఎస్ఐ లోకేశ్‌రెడ్డి ఆదేశాలపై ఎఎస్ఐ ఎన్.మధుసూదనాచారి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృత దేహానికి తిరుపతి స్విమ్స్ మెడికల్ కాలేజీలో శవపరీక్ష చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతి చెందిన చౌడం వెంకటరమణ

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని కొర్లకుంట పంచాయతీ ఎగువతూపల్లికి చెందిన చౌడం వెంకటరమణ(50) శుక్రవారం విద్యుద్ఘాతంతో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గోరాన్ చెరువు పంచాయతీ ఆవులశెట్టి వారి పల్లి వద్ద వెంకటరమణకు రెండు ఎకరాలు పొలం ఉందని తెలిపారు. అక్కడ వరి పొలానికి నీరు పెట్టేందుకు శుక్రవారం ఉదయం 6 గంటలకు వెళ్లారని పేర్కొన్నారు. తన పొలం పక్క ఉన్న రాజా నారాయణ అనే రైతు మోటారుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి వెళ్లగా ఆ విద్యుత్ వైరు కింద పడి తలగడంతో విద్యుద్ఘాతానికి గురై మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సోమేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ రఘురాం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

ఎనిమిది మందికి గాయాలు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గోరాం చెరువు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు చెందారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు...మండలంలోని ఎగువ గొట్టివీడు నుంచి ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది ఆటోలో గాలివీడుకు వెళుతున్నారు. గోరాం చెరువు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న మేకను ఢీకొని అనంతరం ఆర్‌టిసి బస్సును కూడా ఢీకొంది. ఈ ప్రమాదంలో అక్కడిక్కడే ఆటో డ్రైవర్ మహబూబ్‌బాషా కుమారుడు సాజిద్(11) మృతి చెందాడు. ఎనిమిది మంది గాయపడగా వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి తరలించినట్లు ఎస్ఐ వెంకట శివకుమార్ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.